

వంతెనలు సరే.. రోడ్లెక్కడ..! 2



హెడ్ కానిస్టేబుల్ మృతి 2

AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatodaynews.com


## ధాన్యం సంచులు దగ్ధం



**అక్షరటుడే, కోటగిరి :** వరి కొయ్యలకు నిప్పు పెట్టడంతో మంటలు వ్యాపించి.. వద్ద సంచులు కాలిపోయాయి. ఈ ఘటన పోతంగల్ మండలంలోని మంజీరా బ్రిడ్జి వద్ద ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వారం క్రితం కాంటా అయినా ధాన్యం ఇంకా తీసుకు వెళ్లలేదు. ఆదివారం వరి కొయ్యలకు నిప్పు పెట్టడంతో అది పెద్ద ఎత్తున వ్యాపించింది. రోడ్డు పక్కన ఉన్న ధాన్యం సంచులకు సైతం మంటలు అంటుకున్నాయి.

26-4-2026 NIZAMABAD / KAMAREDDY PAGES - 2

# భక్తిశ్రద్ధలతో వాసవి కన్యకాపరమేశ్వరి జయంతి వేడుకలు





నగరంలో వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి విగ్రహాన్ని భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. అమ్మవారి జన్మదిన వేడుకల్లో భాగంగా నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. నగరేశ్వర ఆలయం నుంచి ప్రారంభమైన విగ్రహ ర్యాలీ పెద్దబజార్ పూసలగల్లి మీదుగా కిషన్ గంజ్‌లోని కన్యకా పరమేశ్వరి ఆలయానికి చేరుకుంది. దారి పొడుగున మహిళల దాండియా నృత్యాలు.. పులివేషం వేసుకున్న వారి ఆటపాటలతో ర్యాలీ ఉత్సాహపూరిత వాతావరణంలో సాగింది. భక్తులకు అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆలయంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్, ఎంపీ అర్వింద్, ఆర్యవైశ్య సంఘం, ఆయా కుల సంఘాల ప్రతినిధులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. - అక్షరటుడే, ఇందూరు



– మిగతా ఫొటోలు 2వ పేజీలో..

## నిజామాబాద్ కమిషనరేట్‌లో భారీగా బదిలీలు..




**అక్షరటుడే, ఇందూరు:** నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో భారీ ఎత్తున బదిలీలు జరిగాయి. పరిపాలనా సౌలభ్యం, విధి నిర్వహణలో భాగంగా కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న 195 మంది సిబ్బందిని బదిలీ చేస్తూ నిజామాబాద్ పోలీస్ కమిషనర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ బదిలీలలో అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్లు, హెడ్ కానిస్టేబుళ్లు, పోలీస్ కానిస్టేబుళ్లు ఉన్నారు. మొత్తం 18 మంది సివిల్ ఏఎస్ఐలను బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. కమిషనరేట్ వ్యాప్తంగా 66 మంది హెడ్ కానిస్టేబుళ్లకు (మహిళా హెడ్ కానిస్టేబుళ్లతో కలిపి) స్థానచలనం కలిగింది. అత్యధికంగా 111 మంది సివిల్ పోలీస్ కానిస్టేబుళ్లను వివిధ స్టేషన్లకు బదిలీ చేశారు. ఇందులో పలువురు మహిళా కానిస్టేబుళ్లు కూడా ఉన్నారు.

### తక్షణమే విధుల్లో చేరాలని ఆదేశం..

బదిలీ అయిన సిబ్బంది అందరిని తక్షణమే విధుల్లో నుంచి రిలీవ్ చేయాలని సంబంధిత అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఎవరినీ నిలిపివేయకుండా, వెంటనే కొత్త స్థానాల్లో రిపోర్ట్ చేసేలా చూడాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. బదిలీ అయిన వారు తమ కొత్త పోస్టింగ్ ప్రాంతాల్లో చేరిన వివరాలను వెంటనే కార్యాలయానికి నివేదించాలని స్పష్టం చేశారు. ఈ బదిలీల ఉత్తర్వుల కాపీలను కమిషనరేట్ పరిధిలోని అందరు ఏసీపీలు, సీఐలు, ఎస్‌హెచ్‌వోలు, ఐటీ సెల్‌కు సమాచారం నిమిత్తం పంపారు.

# వణికిస్తున్న వన్యమృగాలు



వన్యమృగాలు జిల్లా ప్రజలను వణికిస్తున్నాయి. అడవిలో ఉండాల్సిన జంతువులు వ్యవసాయ భూములు, జనావాసాల్లోకి వస్తున్నాయి. ఎండలు మండుతుండటంతో దాహం తీర్చుకోవడానికి గ్రామాల్లోకి వస్తున్నాయి. ఈ క్రమంలో పశువులు, ప్రజలపై దాడులు చేస్తున్నాయి. దీంతో అటవీ శివారు ప్రాంత గ్రామాల ప్రజలు భయాందోళనకు గురి అవుతున్నారు. - అక్షరటుడే, కామారెడ్డి



■ ఆందోళన చెందుతున్న అటవీ శివారు ప్రజలు ■ పెద్దపులి, చిరుతలు, ఎలుగుబంట్ల సంచారంతో భయం ■ చర్యలు తీసుకోవాలని ప్రజల వేడుకోలు

కామారెడ్డి జిల్లాలో వన్య మృగాలు జనావాసాల్లోకి చేరి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ఇటీవల ఉమ్మడి మాచారెడ్డి మండలంలో పద్దపులి సంచారం శివారు ప్రాంతాల ప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేసింది. పెద్దపులి మనుషుల జోలికి వెల్లకపోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. తాజాగా ఎలుగుబంటి దాడి కలకలం రేపుతోంది.

### చిరుత పులుల సంచారం

పెద్దపులితో పాటు చిరుతలు సైతం జిల్లాలో సంచారిస్తున్నాయి. ఆవులు, లేగ దూడలపై దాడులు చేసి చంపుతున్నాయి. ముఖ్యంగా చిరుత పులుల సంచారం ఇటీవల బాగా పెరిగిపోయింది. జిల్లాలో ప్రతి రోజు ఏదో ఒక చోట చిరుత పులి దాడిలో పశువులు బలవుతూనే ఉన్నాయి. దాంతో అడవి పక్కనే ఉన్న శివారు ప్రాంతాల ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా గిరిజనులు అడవి వైపు వెళ్లాలంటే జంకుతున్నారు.

### పెద్దపులి సంచారం

కామారెడ్డి జిల్లాలో పెద్దపులి సంచరిస్తోంది. గడిచిన ఆరు నెలల్లో మూడు సార్లు పెద్దపులి ఆనవాళ్లు లభించాయి. ఆవులు, దూడలపై దాడులు చేసింది. ముఖ్యంగా మాచారెడ్డి రేంజ్ పరిధిని పెద్దపులి తనకు అవాసంగా మార్చుకుందన్న ప్రచారం సాగుతోంది. మూడుసార్లు కనిపించిన పెద్దపులి రెండుసార్లు మాచారెడ్డి రేంజ్ పరిధిలోనే తిరిగినట్టుగా తెలుస్తోంది. దాంతో అక్కడి ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు.

### ఎలుగుబంటి దాడితో..

రామారెడ్డి మండలం రెడ్డిపేట స్కూల్ తండా శివారులో ఆరు నెలల క్రితం పెద్దపులి సంచరించింది. తండాకు కూతవేటు దూరంలో ఆవుపై దాడికి చేసి కలకలం సృష్టించగా.. తాజాగా శుక్రవారం తెల్లవారుజామున తునికాకు సేకరణకు వెళ్లిన తండా వాసిపై ఎలుగుబంటి దాడి చేసింది. అది పెద్దపులే దాడి చేసినట్టుగా ప్రచారం సాగింది. చివరికి అది ఎలుగుబంటి అని అధికారులు తేల్చారు. తండా శివారులో ఆడ, మగ ఎలుగుబంట్లు రెండు తిరుగుతున్నాయని తండా వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఎలుగుబంటి కోసం గాలిస్తున్న అటవీ అధికారులు

### చర్యలు తీసుకోవాలి

శివారు ప్రాంతాలకు దగ్గరగా ఉన్న గ్రామాలు, తండాలోకి వన్యమృగాలు రాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు అటవీశాఖ అధికారులను కోరుతున్నారు. ప్రతిరోజు అడవికి వెళ్లే తమపై ఏ మృగం ఎక్కడి నుంచి దాడి చేస్తుందోనని భయపడుతున్నట్లు చెప్పారు. అధికారులు స్పందించి మృగాలు జనావాసాల్లోకి రాకుండా చర్యలు చేపట్టాలని వేడుకుంటున్నారు.

## రాజారాం స్టేడియం వాకర్స్ అసోసియేషన్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలోని రాజారాం స్టేడియం వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నగర మేయర్ ఉమారాణి రమేశ్ హాజరయ్యారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షుడిగా వై.దిగంబర్, ప్రధాన కార్యదర్శిగా ఎన్. సాయిలు, కోశాధికారిగా బి.వెంకటేష్ గౌడ్, ఉపాధ్యక్షులుగా కె.శ్రీనివాస చారి, సంయుక్త కార్యదర్శిగా ఏ.శ్రీశైలం, కార్యవర్గ సభ్యులుగా మఠం రవి, డి.వెంగళరావు, ఎం.రాజు, జి.రాకేష్, ఎస్.కే.షబాన ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. రాజారాం స్టేడియం అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని హామీ ఇచ్చారు. స్టేడియంలో ఉన్న సమస్యలను ఉన్నతాధికారులతో చర్చించి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేలా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాంభూపాల్, తొమ్మిదో డివిజన్ కార్పొరేటర్ కేతావత్ సురేఖ అమర్ సింగ్, ఐటీఐ అధ్యక్ష కార్యదర్శులు మురళి, పృథ్వీరాజ్, కాంగ్రెస్ నాయకులు కిషన్ రెడ్డి, అలాగే అసోసియేషన్ ప్రధాన సలహాదారులు వినయ్ కుమార్, డి.శంకర్, జ్ఞానేశ్వర్, మాజీ అధ్యక్షుడు నజీర్, రమాకాంత్, వాకర్స్ పాల్గొన్నారు.

## స్వీయగణనను సద్వినియోగం చేసుకోవాలి



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** జన గణన ప్రక్రియలో భాగంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో స్వీయ నమోదు చేసుకున్నారు. జన గణనలో స్వయంగా వివరాలు నమోదు చేసుకునేందుకు అందుబాటులోకి తెచ్చిన https://se.census.gov.in వెబ్‌సైట్ ద్వారా తన వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జన గణన ప్రక్రియను సులభంగా, సమగ్రంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం డిజిటల్ స్వీయ గణన విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చిందని తెలిపారు. ఆన్‌లైన్‌లో ప్రజలు తమ వ్యక్తిగత, కుటుంబ వివరాలను నమోదు చేసుకోవచ్చని వివరించారు. వెబ్ పోర్టల్ లేదా మొబైల్ యాప్ ద్వారా స్వయంగా నమోదు చేసుకునే వెసులుబాటు కల్పించినట్లు పేర్కొన్నారు. స్వీయ నమోదు ఈ నెల 26 నుంచి మే 10వ తేదీ వరకు చేసుకోవచ్చని కలెక్టర్ సూచించారు. తమ సమాచారాన్ని 15 నిమిషాల వ్యవధిలో పూర్తి చేసుకోవచ్చని చెప్పారు.

## జనగణన ప్రక్రియ దేశానికి ఎంతో కీలకం..: షబ్బీర్ అలీ

**అక్షరటుడే, కామారెడ్డి:** జనగణన ప్రక్రియ దేశానికి ఎంతో కీలకమని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. దేశవ్యాప్తంగా చేపట్టనున్న సెన్సెస్ ఆఫ్ ఇండియా 2027 కార్యక్రమానికి సంబంధించి స్వీయ నమోదు ప్రక్రియపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. డైరెక్టరేట్ ఆఫ్ సెన్సస్ ఆపరేషన్స్ తెలంగాణ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో ఓరియంటేషన్ సెషన్ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న షబ్బీర్ అలీ తన వివరాలను సెన్సెస్‌లో నమోదు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన వ్యక్తిగతంగా వివరాలను సమర్పించి కులగణనలో స్వీయ నమోదు చేసుకున్నానని తెలిపారు. ప్రజలు ఎలాంటి అపోహలు, అనుమానాలు లేకుండా ముందుకు వచ్చి తమ వివరాలను నిజాయితీగా నమోదు చేయాలని సూచించారు. ఈ సెన్సెస్ కేవలం గణాంకాల కోసం మాత్రమే కాదని, భవిష్యత్తులో ప్రభుత్వ విధానాలు, సంక్షేమ పథకాలు సరైన లబ్ధిదారులకు చేరేందుకు కీలకంగా ఉపయోగపడుతుందని తెలిపారు. కులగణన ద్వారా ప్రతి వర్గానికి సంబంధించిన వాస్తవ పరిస్థితులు వెలుగులోకి వస్తాయని చెప్పారు. ఫలితంగా సమాజంలోని అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించే విధంగా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోగలదని స్పష్టం చేశారు. ప్రతి కుటుంబం బాధ్యతగా భావించి సెన్సెస్‌లో పాల్గొనాలని, స్వీయ నమోదు ప్రక్రియను సులభంగా పూర్తి చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. డిజిటల్ విధానంలో జరుగుతున్న ఈ నమోదు ప్రక్రియ పారదర్శకంగా, సులభంగా ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ మధుమోహన్, మున్సిపల్ ఛైర్ పర్సన్ ఇప్ప ఉమారాణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## ఘనంగా గంగమ్మ తల్లి బోనాలు



**అక్షరటుడే, ఎల్లారెడ్డి :** మండలంలోని వెల్లుట్లపేటలో ఆదివారం గంగపుత్రుల ఆధ్వర్యంలో గంగమ్మ తల్లి బోనాల ఘనంగా నిర్వహించారు. మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొయ్యల వినోద రాజా గౌడ్, ఉప సర్పంచ్ కర్రి చెవుల రాజు యాదవ్, పెంట అంజయ్య, కొనింటి సాయిలు, కర్రెల వెంకబోయ్, ఎర్రల పోచయ్య, కొట్టాల బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## యువతి అదృశ్యం

**అక్షరటుడే, ఎల్లారెడ్డి :** ఎల్లారెడ్డి మండలం ఎర్రమన్నుకుచ్చకు చెందిన కల్లెం ఎల్లయ్యకు ముగ్గురు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నారు. ఆయన తన కుటుంబంతో సోమార్పేట్‌లోని డబుల్ బెడ్ రూం ఇళ్లలో నివాసం ఉంటున్నాడు. శనివారం సాయంత్రం ఆయన పెద్ద కుమార్తె (19) అదృశ్యమైంది. పలు చోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో యువతి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## వాసవి కన్యకాపరమేశ్వరి జయంతి వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న ఎంపీ అర్వింద్..



నిజామాబాద్ కలెక్టరేట్‌లో..



గాంధారిలో ఊరేగింపు..



ప్రజల సౌకర్యార్థం రూ.కోట్లు ఖర్చు చేసి వంతెనలు నిర్మిస్తున్న అధికారులు.. వాటికి అనుసంధానంగా రోడ్లు వేయడంపై మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నారు. ప్రజలకు ఇబ్బందికరంగా మారిన రహదారులపై వంతెన నిర్మించినప్పటికీ వాటికి ఇరువైపులా రోడ్లు వేయకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వర్షా కాలం వస్తే ప్రమాదకరమని తెలిసినా అధికారులు పట్టించుకోక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

– అక్షరటుడే, కామారెడ్డి

# వంతెనలు సరే.. రోడ్లెక్కడ..?

■ రూ.కోట్లు ఖర్చు చేసి బ్రిడ్జిల నిర్మాణం ■ రూ.లక్షలు ఖర్చయ్యే రోడ్లను వదిలేసిన వైనం ■ వర్షాలు పడితే ప్రమాదకరంగా మారనున్న వంతెనలు

ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని తాడ్వాయి మండలం బ్రాహ్మణపల్లి, కాళోజీవాడి రహదారుల్లో వంతెనలు లేక వర్షం పడితే కామారెడ్డి వైపు రాకపోకలు నిలిచిపోయేవి. ఏళ్ల తరబడి ఉన్న ఈ సమస్యకు అధికారులు రూ.3 కోట్లు ఖర్చు చేసి రెండు వంతెనలు నిర్మించారు. అలాగే రామారెడ్డి గంగమ్మ వాగు బ్రిడ్జి ప్రమాదకరంగా ఉండడంతో రూ.3 కోట్ల వ్యయంతో బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. ఈ వంతెనల నిర్మాణం వల్ల ప్రజలకు ఇబ్బందులు తొలగనున్నాయి.

**ఇరువైపులా రోడ్లను మరిచారు..**

ఏళ్ల తరబడి కాంట్రాక్టర్లకు బిల్లులు రాకపోవడంతో బ్రిడ్జిల నిర్మాణం నిలిచిపోయింది. దీంతో ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు చొరవతో బ్రిడ్జిల నిర్మాణం పూర్తయింది. అయితే వంతెనలకు ఇరువైపులా రోడ్లను మాత్రం నిర్మించడం మరిచారు. ఫలితంగా వచ్చే వర్షాకాలంలో భారీ వర్షాలు కురిస్తే మట్టి రోడ్డు కూరుకుపోయి రోడ్లు కుంగి పోయి ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉన్నాయి. ఇకనైనా అధికారులు స్పందించి తక్షణమే రోడ్ల నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. రోడ్లు వేయకపోతే బ్రిడ్జిలు నిర్మించి కూడా ఫలితం లేకుండా పోతుందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

## అయ్యప్ప ఆలయంలో అన్నదానం



**అక్షరటుడే, బాన్సువాడ:** తెలంగాణ రాష్ట్ర సేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని బాన్సువాడలోని అయ్యప్ప ఆలయంలో ఆదివారం అన్నదానం చేశారు. కార్యక్రమాన్ని టీఆర్ఎస్ బాన్సువాడ నియోజకవర్గ నాయకుడు మామిండ్ల రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం నిరుపేదలకు, భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా మామిండ్ల రాజు మాట్లాడుతూ.. పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత నాయకత్వంలో మంచి సంకల్పంతో పార్టీ ఆవిర్భవించిందని తెలిపారు. ఆమె సంకల్పం నెరవేరాలని కోరుకుంటూ ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం చేసినట్లు తెలిపారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం, నిరుపేద కుటుంబాల సంక్షేమం కోసం కవిత నిరంతరం కృషి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు.


## వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి వేడుకలు



**అక్షరటుడే, ఎల్లారెడ్డి :** వాసవి కన్యకా పరమేశ్వరి జయంతిని ఎల్లారెడ్డి ఆదివారం నిర్వహించారు. వైశాఖ శుక్లపక్ష దశమిని పురస్కరించుకొని వాసవి మాత ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వైశ్యులు స్థానిక దొరవారి హనుమాన్ మందిరం నుంచి కలశం హారతితో పోచమ్మ గుడి వరకు ఊరేగింపుగా వెళ్లారు. ఆలయంలోని అమ్మవారికి అభిషేకం చేసి వాసవి మాత ఆలయానికి చేరుకున్నారు. ఆలయంలో కుంకుమార్చనలు, ఓడి బియ్యం, అమ్మవారి చరిత్ర సాము హిక పారాయణం నిర్వహించారు. మధ్యాహ్నం ప్రత్యేక పూజలు చేసి అన్నదానం చేశారు. సాయంత్రం మంగళహారతులు దాండియా అంతాక్షరి పిల్లల సాంస్కృతిక నృత్యాలు, షోడశోపచార పూజలో నృత్యం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు కంచర్ల బాలకిషన్ గుప్తా, వందలాది వైశ్యులు పాల్గొన్నారు. వైశ్యుల ఆరాధ్య దేవత వాసవి కన్యకా పరమేశ్వరి జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించినందుకు సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి ఆర్యవైశ్య సంఘం నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సిద్ది శ్రీధర్ మాట్లాడుతూ వైశ్యుల కలను రాష్ట్ర ప్రభుత్వం నిజం చేసిందని కొనియాడారు. వైశ్యులు ఐక్యంగా ఉంటే ఏదైనా సాధ్యమన్నారు.

## లయన్స్ క్లబ్ ఆఫ్ ఇందూర్ నూతన కార్యవర్గం ఎన్నిక

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** లయన్స్ క్లబ్ ఆఫ్ ఇందూర్ సర్వసభ్య సమావేశం ఆదివారం నగరంలోని సందీప్ గార్డెన్స్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా 2026-27కు గాను నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. క్లబ్ అధ్యక్షుడిగా పెట్టిగాడి రాఘవేందర్, కార్యదర్శిగా చింతల గంగాదాస్, కోశాధికారిగా అంకం రాజేందర్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా లయన్స్ జిల్లా అదనపు కోశాధికారి పి.లక్ష్మీనారాయణ వ్యవహరించారు. లయన్స్ సేవలను మరింత విస్తృత పరుస్తామని నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన రాఘవేందర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో లయన్స్ జిల్లా కార్యదర్శులు యాదగిరి, కె.రవీందర్, జోన్ ఛైర్మన్ అబ్బాయి లింబాద్రి, రీజియన్ పూర్వ ఛైర్మన్ బి.గురుప్రసాద్, డైరెక్టర్ వెంకటేష్ పాల్గొన్నారు.



## ఊరడమ్మ ఆలయ పునర్నిర్మాణానికి ముందుకు రావడం అభినందనీయం..



**అక్షరటుడే, భిక్కనూరు:** మండలంలోని కాచాపూర్‌లో ఊరడమ్మ ఆలయ పునర్నిర్మాణానికి మాజీ ఎంపీపీ తొగరి బైండ్ల సుదర్శన్ ముందుకు రావడం అభినందనీయమని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి అన్నారు. గ్రామంలో ఆలయ పునర్నిర్మాణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. ఆలయ నిర్మాణం త్వరగా పూర్తి కావాలని.. గ్రామంలో ప్రజలు సుఖఃసంతోషాలతో ఉండాలని, పాడి పంట సమృద్ధిగా ఉండాలని ఆయన అమ్మవారికి పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పాలమాకుల జ్యోతి సంతోష్ గౌడ్, ఉపసర్పంచ్ బైండ్ల తొగరి దశరథం, వార్డు సభ్యులు రమేష్, రేణుక, మోహన్ రెడ్డి, మాసన్నపేట వెంకటలక్ష్మి, ప్రవీణ్ గౌడ్, అమృతరావు, జోగు నవీన్, కొండ మడుగు లావణ్య, మాజీ పోలీస్ పటేల్ వతందారు కామినేని తిరుపతి రెడ్డి, మాలిష్ పటేల్, మోతె లావణ్య, మాజీ ఎంపీపీ జాంగారి గాల్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గన్నమనేని నర్సింగరావు, బీఆర్ఎస్ నేత అబ్బ బాలకిషన్, అంబేద్కర్ సంఘం నాయుకులు, సభ్యులు, వివిధ పార్టీల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.


## నాన్‌వెజ్ వండలేదని అడిగినందుకు భర్త హత్య

**అక్షరటుడే, కామారెడ్డి:** కుటుంబంలో చిన్నపాటి తగాదాలు ప్రాణాలు తీసుకునే వరకు వెళ్తున్నాయి. ఇలాంటి ఘటన కామారెడ్డి జిల్లా కేంద్రంలో తాజాగా మరోటి చోటుచేసుకుంది. కామారెడ్డి పట్టణంలో కుటుంబ కలహాలు హత్యకు దారితీశాయి. చిన్నపాటి గొడవ క్షణాల్లో హింసాత్మకంగా మారి, ఒక కుటుంబాన్ని చిదిమేసింది. 20వ వార్డు వాంబే కాలనీలో శనివారం రాత్రి భార్య చేతిలో భర్త ప్రాణాలు కోల్పోయాడు. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. కోదండం లక్ష్మీ-శివాజీ దంపతులు అద్దె ఇంట్లో నివసిస్తూ కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు చిన్నారులు ఉన్నారు. శనివారం రాత్రి జరిగిన వాగ్వాదం తీవ్రరూపం దాల్చింది. కోపోద్రుక్తురాలైన లక్ష్మీ పక్కనే ఉన్న కొడవళితో భర్త శివాజీపై దాడి చేసింది. తీవ్ర గాయాలతో శివాజీ అక్కడికక్కడే మృతి చెందాడు.

**చిన్నపాటి గొడవ..**

ఇద్దరి మధ్య ప్రారంభమైన చిన్నపాటి గొడవ హత్యకు దారితీసినట్లు తెలుస్తోంది. కామారెడ్డి పట్టణంలో భర్తను భార్య హత్య చేసిన ఘటన సంచలనం సృష్టించింది. ఇది ఘటన తీవ్ర చర్చకు దారితీసింది. అయితే ఈ కేసుల పలు విషయాలు బయటకు వచ్చాయి. శనివారం రాత్రి.. నాన్ వెజ్ ఎందుకు వండలేదని అడిగిన పాపానికి భర్తను కొడవలితో నరికి హత్య చేసినట్లు సమాచారం. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. కామారెడ్డి పట్టణంలోని వాంబే కాలనీలో కోదండ శివాజీలక్ష్మి దంపతులు ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. రోజువారీ కూలి చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వీరికి రెండేళ్లు, ఏడాది వయసున్న ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. అయితే శనివారం రాత్రి భార్యాభర్తల మధ్య వంట విషయంలో వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో నాన్ వెజ్ ఎందుకు వండలేదని శివాజీ ప్రశ్నించగా.. చిన్నపాటి గొడవ జరిగింది. ఈ క్రమంలో లక్ష్మి కొడవలితో భర్త మెడపై దాడి చేసింది. దీంతో శివాజీ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ నరహరి తెలిపారు.

## ప్రైవేట్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రాజగోపాల్ యాదవ్



**అక్షరటుడే, పఠాన్‌చెరు :** తెలంగాణ రాష్ట్ర ప్రైవేటు ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పటాన్‌చెరు పట్టణానికి చెందిన రాజగోపాల్ యాదవ్ నియమితులయ్యారు. తెలంగాణ రాష్ట్ర కనీస వేతన సలహా మండలి ఛైర్మన్ డాక్టర్ జనక్ ప్రసాద్ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజ్ గోపాల్ యాదవ్ మాట్లాడుతూ.. తనపై విశ్వాసం ఉంచి ఈ బాధ్యతలు ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రైవేటు ఉద్యోగుల హక్కుల సాధన కోసం కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా డాక్టర్ జనక్ ప్రసాద్ మాట్లాడుతూ.. కార్మికులు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటానికి తన సంపూర్ణ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కనీస వేతన సలహా మండలి బోర్డు మెంబర్ రాజు ముదిరాజ్, కార్మిక నాయకులు పాల్గొన్నారు.

## మిత్రుడికి ఆర్థిక సహాయం



**అక్షరటుడే, భీమ్‌గల్(వేల్పూరు):** అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న వేల్పూర్ మండల కేంద్రానికి చెందిన మంగళి హరీష్ కుటుంబానికి వేల్పూర్ మాల్టా అసోసియేషన్ సభ్యులు ఆర్థిక చేయూతనిచ్చి ఉదారతను చాటుకున్నారు. హరీష్ చికిత్స నిమిత్తం అసోసియేషన్ సభ్యులు చందాలు వేసుకుని సేకరించిన రూ. 70,500లను వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ.. తోటి మిత్రుడు ఆపదలో ఉన్నాడని తెలిసి అందరం కలిసి ఈ మొత్తాన్ని సేకరించామని తెలిపారు. హరీష్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆపద సమయంలో ఆర్థికంగా ఆదుకున్న మాల్టా అసోసియేషన్ సభ్యులకు హరీష్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఎడపల్లిలో ఉచిత వైద్య శిబిరం



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ఎడపల్లిలోని గ్రామ సచివాలయం వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఎడపల్లి సర్పంచ్ కందగట్ల రామచందర్ ఆధ్వర్యంలో నిజామాబాద్ నగరంలోని శ్రీ హర్ష డయాబెటిక్ కేర్ సెంటర్ జ్యోతి ల్యాబ్ సంయుక్తంగా ఆదివారం నిర్వహించారు. ప్రజలకు బీపీ, షుగర్, థైరాడ్ సంబంధించిన పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ సురేందర్ రెడ్డి రోగులకు పరీక్షలు చేశారు. అనంతరం డయాబెటిక్ పేషెంట్లకు తగు ఆహార నియమాలతో పాటు, వ్యాయామం గురించి తగిన సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎడపల్లి సర్పంచ్ కందగట్ల రామచందర్, నిర్వాహకులు బొట్టు వెంకటేష్, భూమేష్ తదితరులు పాల్గొన్నారు.



## పద్మశాలి కార్పొరేటర్లకు సన్మానం

**అక్షరటుడే, ఇందూరు:** నగరంలోని వర్నిరోడ్ పద్మశాలి హాస్టల్‌లో పద్మశాలి వసతి గృహ సంస్థ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల జరిగిన మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో విజయం సాధించిన పద్మశాలి కార్పొరేటర్లు ఇప్పకాయల సుమిత్ర, సామల ప్రసన్నను ఘనంగా సన్మానించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ.. నగరంలోని ఆయా డివిజన్ల అభివృద్ధికి పద్మశాలి కార్పొరేటర్లు కృషి చేయాలని సూచించారు. అలాగే పద్మశాలి కమ్యూనిటీ అభివృద్ధికి సైతం పాటు పడాలని సూచించారు. కార్యక్రమంలో పద్మశాలి హాస్టల్ అధ్యక్ష కార్యదర్శులు దీకొండ యాదగిరి, గంట్యాల వెంకటేష్, కోశాధికారి కన్న రాజు, పద్మశాలి సంఘాల ప్రతినిధులు బిజ్జు దత్తాద్రి, దాసరి నర్సింలు, పుల్గం హన్మాండ్లు, మైసల నారాయణ, సామల సత్యపాల్, బాస రాజేశ్వర్, పార్థసారథి, హరిదాస్ పాల్గొన్నారు.

## బ్రెయిన్ స్ట్రోక్‌తో హెడ్ కానిస్టేబుల్ మృతి



**అక్షరటుడే, డిచ్‌పల్లి:** బ్రెయిన్ స్ట్రోక్‌తో హెడ్ కానిస్టేబుల్ మృతి చెందారు. ఈ ఘటన ధర్పల్లిలో చోటు చేసుకుంది. ధర్పల్లి పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఎస్.నర్సయ్య శనివారం రాత్రి బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందారు. కొన్నాళ్లుగా ఆయన అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో ఆరోగ్యం క్షీణించి శనివారం స్ట్రోక్ రావడంతో శనివారం మృతి చెందారు. దీంతో కానిస్టేబుల్ కుటుంబంలో రోదనలు మిన్నంటాయి. ధర్పల్లి ఎస్సై, పోలీస్‌స్టేషన్ సిబ్బంది ప్రగాఢ సానుభూతి తెలిపారు. సౌమ్యుడిగా పేరున్న ఆయన అకాలమరణం చెందడంపై విచారం వ్యక్తం చేశారు. నర్సయ్యకు నివాళులర్పించారు.